

18, 19న హలో బిసి చలో ఢిల్లీ

ప్రజాశక్తి-కడియం

ఢిల్లీలో ఈ నెల 18, 19 తేదీల్లో హలో బిసి చలో ఢిల్లీ అనే నినాదంతో చేపట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని బత్తుల నాగేశ్వరరావు, దండుబోయిన వీర వెంకట సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని బుర్రిలంకలో శనివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈ మహా ధర్నా చేపట్టినట్టు తెలిపారు. ఈ సమావేశంలో వై.నూకాలమ్మ, మండల కన్వీనర్ నూనె వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల్లేక లస్కర్ల ఆవేదన

- 11 నెలలుగా జీతాలు పెండింగ్
- రూ.1.38 కోట్ల బకాయిలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నీటి పారుదల శాఖలో క్షేత్రస్థాయిలో కీలకంగా సేవలందిస్తున్న లస్కర్లు ఆకలి బాధలు ఎదుర్కొంటున్నారు. ఏడాది కాలంగా వేతనాలు విడుదల చేయకపోవటం పాలకుల నిర్లక్ష్యాన్ని దర్పణం పడుతోంది. ఒకటి రెండు కాదు ఏకంగా 13 నెలలుగా వేతనాలు జిల్లాలో బకాయిలు ఉన్నాయి. తూర్పు, మధ్య డెల్టా, హెడ్ వర్క్స్, పెద్దాపురం, ఏలేశ్వరం డివిజన్ల పరిధిలో లస్కర్లు సేవలందిస్తున్నారు. సాగునీటి కాలువలకు నీటి విడుదల, గోదావరి వరదల సమయంలో క్షేత్రస్థాయిలో లస్కర్ల పనితీరు అత్యంత కీలకం. కాలువల నుంచి పిల్లకాలువలకు నీటి మళ్లించేందుకు వినియోగించే స్లూయిజ్‌లు, కల్వర్టులు, బ్యారేజికి ఉండే గేట్లు పనితీరు, షట్టర్లు, హెచ్ స్లూయిజ్‌లు వంటి మరమ్మతులు, నీటి విడుదల సమయంలో ఎంతమేరకు నీటిని సరఫరా అవసరమో ఆ మేరకు విడుదల చేస్తుంటారు. గోదావరి గట్లు ఎక్కడ ఎక్కడ బలహీనంగా ఉన్నాయి వంటి అనేక పనుల పర్యవేక్షణ లస్కర్లు నిర్వహిస్తుంటారు. రైతులకు అధికారులకు మధ్య రాత్రింబగళ్లు అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో లస్కర్ క్రియాశీలక పాత్ర పోషిస్తారు. అటువంటి ఉద్యోగులు సిబ్బంది కొరత నేపథ్యంలో ఒకొ వైపు పని ఒత్తిడి మరోవైపు తాజాగా రాజకీయ వేధింపులు చుట్టుముట్టడంతో మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా మారిందనే ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది.



ఆత్రేయపురంలోని లొల్ల లాకులు

11 నెలలుగా వేతనాలు పెండింగ్

తాజాగా ఈ ఏడాది జూన్ నుంచి అగస్టు వరకూ మూడు నెలల బకాయిలతోపాటు గత ప్రభుత్వం 2023-2024లో 8 నెలల వేతనం, 2022-2023లో ఫిబ్రవరి, మార్చి 2 నెలల వేతనం మొత్తం 13 నెలలు బకాయిలు ఉన్నాయి. లస్కర్లకు నెలకు రూ.10,500 వేతనం చెల్లించాలి. జిల్లాలో 120 మంది లస్కర్లకు నెలకు రూ.12,60,000 చెల్లించాల్సి ఉంది. గడిచిన 13 నెలలుగా బకాయిలు ఉండటంతో అక్షరాలా రూ.1,38,60,000 బకాయిలు ఉన్నాయి. లస్కర్ల జాబ్ చార్ట్ ప్రకారం కేవలం 8 నెలల కాలానికి విధుల్లోకి తీసుకోవటం పరిపాటి. దీనికి భిన్నంగా అదనంగా మరో 2 నెలలు విధులు కేటాయిస్తున్నప్పటికీ వేతనాలు చెల్లించడం లేదు. ప్రతి రోజువారీ విధులలో భాగంగా కాల్వలకు నీరు విడుదల చేయటంతో పాటు తమ పరిధి మేరకు సుమారు 20 కిలో మీటర్ల మేర ఇరువైపులా పర్యవేక్షిస్తున్నారు. కాల్వల ఆధునీకరణ లేకపోవటం, సిబ్బంది కొరత నేపథ్యంలో అదనపు విధులు కేటాయించడం పరిపాటిగా మారింది. దీంతో వీరు పని ఒత్తిడికి గురౌతున్నారు. తాజాగా ప్రభుత్వం మారిన నేపథ్యంలో రాజకీయ వేధింపులూ పరిపాటిగా మారాయి. కూటమి ప్రభుత్వం అనుకూలమైనవారిని నియమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో లస్కర్లు ఉద్యోగ భద్రత కరువై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాలని వేడుకుంటున్నారు

487 మందికి గాను 120 మంది సిబ్బంది

487 మంది లస్కర్లు అవసరం కాగా కేవలం 120 మందితో నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 431 కిలో మీటర్లు ప్రధాన కాల్వలు ఉన్నాయి. మరో 2024 కిలో మీటర్ల మేర అనుసంధానమైన చిన్నకాల్వలు ఉన్నాయి. ఈ కాల్వల పరిధిలో ఉభయ గోదావరి జిల్లాల్లో 8.96 లక్షల ఎకరాల్లో ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్నారు. వ్యవసాయ రంగంలో సాగునీరే కీలకమైంది. ప్రణాళికాబద్ధంగా నీరు విడుదల చేయకపోతే చివరి దశలో పంట దెబ్బతినే అవకాశం లేకపోలేదు. వరదల సమయంలోనూ పైస్థాయిలో ఉన్న ఎఇ, డిఇ స్థాయి అధికారులకు పంట కాలువల పరిస్థితులపై ఎప్పటికప్పుడు లస్కర్లు సమాచారం అందిస్తుంటారు. లాకులు ఎత్తడం దించడం వంటి కార్యక్రమాలను అర్ధరాత్రులు సైతం అధికారుల ఆదేశాల మేరకు చేస్తుంటారు. వాస్తవానికి వీరు చేసే పని ఎక్కువ, వీరికి కేటాయించిన జీతం చాలా తక్కువ. విధి నిర్వహణ ఎంత కష్టమైనప్పటికీ ఏదో ఒక రోజు ప్రభుత్వం పర్మినెంట్ చేస్తుందని లస్కర్లు తమ విధులు కష్టమైనా ఇష్టంగా చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని, వేతనాలు సకాలంలో విడుదల చేయాలని లస్కర్లు కోరుకుంటున్నారు.

మూడు ప్రాణాలు తీసిన ప్రమాదం

బైకులు ఢీకొని ఇద్దరు మృతి
కుమారుని మరణ వార్తతో గుండాగిన తండ్రి

రాఖీ కడతాను రా అన్నయ్య అని చెల్లెళ్లు ఫోన్ చేయడంతో వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, అతడి మరణ వార్త విని తండ్రి గుండాగి మరణించాడు. ఇదే ప్రమాదంలో గాయపడిన వ్యక్తి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు.



శంకర్ (ఫైల్‌ఫొటో)



గాయపడిన సువర్ణరాజు

ప్రజాశక్తి-గోపాలపురం, తాళ్లపూడి

రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఒకరు ఘటనా స్థలంలో, మరొకరు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందారు.. ఘటనా స్థలంలో మృతి చెందిన వ్యక్తి తండ్రి కుమారుని మరణ వార్తతో కుప్పకూలిపోయి గుండాగి మరణించాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలివి.. తాళ్లపూడి మండలం పెద్దేవంకు చెందిన గండేపల్లి శంకర్ (30) అవివాహితుడు. ఆకుకూరలు అమ్ముతుంటాడు. శంకర్ తండ్రి డయాలసిస్ పేషంట్. తన తండ్రిని ఆసుపత్రికి తీసుకు వెళ్లాల్సి ఉంది. రాఖీ పండగ కావడంతో ఆసుపత్రికి వెళ్లేందుకు వాయిదా వేశారు. మణి శంకర్‌కు అదే గ్రామంలోని సొంత అక్క రాఖీ కట్టింది. తన చిన్నమ్మ కుమార్తెలు (చెల్లెళ్లు) రాఖీ కడతాము రమ్మనడంతో దేవరపల్లి మండలం యాదవోలుకు బయల్దేరాడు. మార్గం మధ్యలో వెంకటాయపాలెం శివారులో గోపాలపురం మండలం వాదాలకుంటకు చెందిన మరపట్ల సువర్ణ రాజు (50) బైకు శంకర్ బైకు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మణి శంకర్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సువర్ణ రాజును రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. సువర్ణ రాజుకు ఒక కుమార్తె కుమారుడు సంతానం ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశాడు.

కుమారుని మృతితో కుప్పకూలిన తండ్రి

రోడ్డు ప్రమాదంలో మణి శంకర్ మృతి చెందిన వార్త విన్న ఆయన తండ్రి శ్రీను గుండాగి మరణించాడు. తండ్రీ కొడుకుల మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



తండ్రి శ్రీను మృతదేహం

మంత్రికి రాఖీలు కట్టిన విఓఎలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రక్షాబంధన్ పండుగలో భాగంగా శనివారం మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావుకు విఓఎలు రాఖీలు కట్టి, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సోదరీమణుల రక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తప్పనిసరిగా వారికి కావాల్సిన అన్ని సదుపాయాలూ కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దె రాజేశ్వరి, గంగాభవాని, శ్రీదేవి, సుబ్బలక్ష్మి, వెంకటలక్ష్మి, పోశమ్మ, రమాదేవి, అమ్మాజీ, కరుణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.



మంత్రి దుర్గేష్‌కు రాఖీలు కట్టిన విఓఎలు

రాకా అసోసియేషన్ కార్డుల ఆవిష్కరణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వందేమాతరం, జనగణమనణ దేశభక్తి పెంపొందించే విధంగా 'రాకా' కల్చరల్ అసోసియేషన్, గోదావరి కల్చరల్ అసోసియేషన్ ముద్రించిన 20 వేల కార్డులను మంత్ర కందుల దుర్గేష్ శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాకా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జివి.రమణ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు, కోశాదికారి సూరపరెడ్డి తాతారావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీల ముగింపు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు జెడ్‌పి హైస్కూల్లో రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలు శనివారం ముగిసాయి. ఫైనల్‌లో బాలికల విభాగంలో ప్రథమ స్థానం తూర్పు గోదావరి జిల్లా, ద్వితీయ స్థానం పశ్చిమ గోదావరి జిల్లా, తృతీయ స్థానంలో విజయనగరం జిల్లాలు నిలబడ్డాయి. బాలుర విభాగంలో ప్రథమ విశాఖ, ద్వితీయ తూర్పుగోదావరి జిల్లా, తృతీయ నంద్యాల గెలుచుకున్నాయి. కరుటూరి సతీష్, సురేష్ కుమార్, దొంగ రామకృష్ణ బహుమతి ప్రదానం చేశారు.

వృద్ధునికి స్వర్ణాంధ్రలో ఆశ్రయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఒక అనాథ వృద్ధునికి స్థానిక స్వర్ణాంధ్రలో శనివారం ఆశ్రయం కల్పించాడు. విశాఖపట్నంలో బంగారం పని చేసే గన్నవరపు మణిబాబు కుటుంబ కలహాలతో ఊరు విడిచి వెళ్లిపోయాడు. ఎక్కడెక్కడో తిరిగి అమ్మమ్మ ఊరైన కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం చేరుకున్నాడు. భార్య ఆదిలక్ష్మి కుమారుడు కుమార్తెతో కలిపి విశాఖపట్నంలో బంగారం పని చేసేవాడు. తిరిగి బొల్లెద్దుపాలెం రావడంతో అతని దీనస్థితి చూసి స్వర్ణాంధ్ర ఆశ్రమంలో చేర్చడానికి ఆశ్రమ నిర్వాహకులు రాంబాబుని ఆశ్రయించారు. అతని భార్య కుమారుడు మృతి చెందడంతో ఒంటరిగా ఎక్కడెక్కడో తిరుగుతూ చివరికి సొంతగూటికి చేరడంతో అనాథ అయిన అతడికి లాలాచెరువులోని స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు ఆశ్రయం కల్పించారు.

రాజకీయ వేధింపులకే అక్రమ అరెస్టులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తెలుగుదేశం హయాంలో జరిగిన మద్యం అవినీతి కేసుల్లో పీకలలోతు వరకు కూరుకుపోయిన చంద్రబాబు దానికి ప్రతీకారంగా సృష్టించిన లిక్కర్ స్కామ్‌తో వేధింపులకు పాల్పడుతున్నారని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. లిక్కర్ స్కామ్ పేరుతో చంద్రబాబు సృష్టించిన బేతాళకథల్లో సంబంధం లేని ఎంపీ మిథున్‌రెడ్డిని కుట్రపూరితంగానే అరెస్ట్ చేశాన్నారు. జైలులో లోక్‌సభలో వైసిపి ఫ్లోర్ లీడర్ మిథున్‌రెడ్డికి రిమాండ్‌లో కల్పించాల్సిన వసతులను కూడా ఇవ్వకుండా అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డికి తన సోదరి పంపిన రాఖీని కూడా కట్టనివ్వకుండా జైలులో అడ్డుకోవడం నీచమన్నారు. 2014-19 వరకు తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిందే నిజమైన లిక్కర్ స్కామ్ అని, కేబినెట్ అనుమతులు లేకుండా ముడుపులు తీసుకుని ఆర్థిక మినహాయింపులు కల్పించారన్నారు. డిస్టిలరీలకు చెందిన ఎనిమిది శాతం పన్నును మినహాయించారని, దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రూ.6,500 కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. దానిని అడ్డం పెట్టుకుని తమకు కావాల్సిన డిస్టిలరీల నుంచే మద్యం కొనుగోళ్లు చేశారని, అది కూడా ప్రభుత్వమే ముందుగా అడ్వాన్స్‌లు చెల్లించిందని తెలిపారు. ఇటువంటి తప్పుడు విధానాలతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. ఆనాడు వైఎస్.జగన్ ప్రజాసంకల్ప పాదయాత్రలో అడుగడుగునా మహిళలు మద్యం వల్ల తమ కుటుంబాలు ఎలా ఇబ్బంది పడుతున్నాయో కన్నీటితో వివరించారన్నారు. మద్యంను నియంత్రిస్తానన్న హామీ మేరకు 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యంను ప్రభుత్వం ద్వారానే విక్రయించడం ద్వారా విచ్చలవిడిగా దొరికే పరిస్థితి లేకుండా చేయాలని, బెల్ట్ షాప్‌లను పూర్తిగా నిర్మూలించాలని, మద్యం రేట్లను పెంచడం ద్వారా కొనుగోలు చేసే వారిని నిరుత్సాహ పరచాలని పాలసీని రూపొందించి అమలు చేశారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కూటమి ప్రభుత్వంలోనే మద్యం అవినీతి

ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా మద్యం పాలసీలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వపరంగా నడిచిన దుకాణాలను ప్రైవేటువ్యక్తులకు అప్పగించారన్నారు. ప్రతి గ్రామం, వార్డుల్లోనూ బెల్ట్ షాప్‌లను ఏర్పాటు చేయించడం, మద్యం దుకాణదారులను కూటమి ఎంఎల్‌ఎలు సిండికేట్లుగా మార్పించడం ద్వారా అధిక రేట్లకు విక్రయించడం, దాని నుంచి వాటాలు అందుకుంటున్నారని తెలిపారు.

ఘనంగా యువజన కాంగ్రెస్ దినోత్సవం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

యువజన కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బిల్డర్ బాబీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు ఆదేశాల మేరకు మంగళవారపు పేటలో బిల్డర్ బాబి యూత్ కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం చేశారు. వీరభద్రపురంలోని గాంధీ కస్తూరిబా సేవా సంఘం స్త్రీల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బన్నులు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిల్డర్ బాబీ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని, మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లోను వెనుబడిందని తెలిపారు. పొరుగు దేశాలతో ఘర్షణలు తప్ప మోడీ సాధించిందేమీ లేదని, అమెరికాతో సత్సంబంధాలు నెలకొల్పడంలో ప్రధాని నరేంద్ర మోడీ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. 2029 ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ మెజారిటీ సాధించి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే దేశానికి మళ్ళీ మంచి రోజులు వస్తాయనిఅన్నారు. మరీదు వెంకట సుధీర్, సున్నం చంద్రశేఖర్, గురుమూర్తి, తుమ్మూరి విజయ్, పిట్టా యర్రయ్య, షేక్ వలీ, షేక్ మహబూబ్, భీమవరపు సాయి, భీమవరపు పవన్, కాదా డేవిడ్, కాకి భాస్కరరావు, కౌజుల సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

మొక్కలు నాటిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు జెడ్‌పి స్కూల్లో శనివారం 2009-2010 పదో తరగతి పూర్వ విద్యార్థులు మొక్కలు నాటారు. ఇటీవల గెట్ టుగెదర్ పార్టీలో మిత్రులు ఆలోచన విధానం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉండాలనే ఆలోచనతో సన్‌రైజ్ మెమోరియల్ ఆర్గనైజేషన్ సంస్థను వారు ఏర్పాటు చేశారు. ఈ సేవా సంస్థ ద్వారా నేటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేసేందుకు వీరు ముందుకు వచ్చారు. మీనానగరం నఫీజ్ ఫైర్ వర్క్ అధినేత మహమ్మద్ నఫీజ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు అంటే తమకు ఎంతో ఇష్టమని ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసేందుకు నేటి యువత ముందుకు రావడం అనేది గొప్ప విషయం అన్నారు. టిడిపి నాయకులు కరుటూరి సతీష్ వారిని అభినందించారు. ఉపాధ్యాయులు రాళ్లపల్లి వరప్రసాద్, షేక్ జిలాని, పేరెంట్స్ విద్యా కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, కుటమి నాయకులు మిరియాల సతీష్, ఇంటి వీరబాబు, పిఇటి విజయ లక్ష్మి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో సమన్యాయం


ప్రజాశక్తి - సీతానగరం

రోడ్డు ఆక్రమణల తొలగింపు విషయంలో కూటమి ప్రభుత్వం అన్ని గ్రామాలకు సమన్యాయం చేస్తుందని, వైసిపి నాయకులు కావాలనే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కూటమి నాయకులు తెలిపారు. రఘుదేవపురంలో శనివారం మట్ట వెంకటేశ్వరరావు, వలవల రాజా, కాండ్రు శేఖర్ పత్రికా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంతోనే మండల అభివద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. వైసిపి హయాంలోనే రఘుదేవపురం నుండి సీతానగరం వరకు ఉన్న రహదారిని కుదించారన్నారు. అప్పట్లో వైసిపి నాయకులు ప్రలోభాలకు లొంగి ఆక్రమణలు తొలగించలేదన్నారు. రఘుదేవపురం నుంచి సీతానగరం రహదారిలో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై స్థానిక ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ దృష్టికి తీసుకురాగా, ఆయన స్పందించి రూ.14 కోట్లతో రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించారని తెలిపారు. రోడ్డు ఆక్రమణల తొలగింపులో సొంత స్థలాలను కోల్పోయిన వారికి ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, టిడిపి ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి తగిన నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి రమేష్, మట్ట కాపు, కవల సురేష్, కొండాటి వీర వెంకట సత్యనారాయణ, కవల గంగారావు తదితర కూటమి నాయకులతో పాటు వీర మహిళలు ఇందుకూరి పద్మావతి, ఒనుమ లక్ష్మి, గోకాడ సూర్యావతి కూడా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

కార్టూ'నిజం'



రేషన్ డీలర్ల పరేషాన్

ఇళ్ల వద్దకు పంపిణీతో అదనపు భారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అసలే అరకొర కమీషన్లతో నెట్టుకొస్తున్న తమ వ్యాపారానికి ఇళ్ల వద్దకు వెళ్లి, రేషన్ ఇవ్వాల్సి రావడంతో తమపై అదనపు ఆర్థిక భారం పడుతోందని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డీలర్లను కేవలం స్టాక్ పాయింట్లు గానే ఉంచి, వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందజేసింది. కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని నిలిపివేసి, మూడు నెలల కిందట రేషన్ దుకాణాల వద్దనే రేషన్ పంపిణీ ప్రారంభించింది. ప్రారంభంలో ప్రభుత్వం రేషన్ డీలర్లకు విధించిన షరతులలో భాగంగా 65 సంవత్సరాలు పైబడ్డ వారికి, వికలాంగులకు వారి ఇళ్ల వద్దకు తీసుకెళ్లి, రేషన్ సరుకులు అందజేయాలని, దుకాణాల సమయ పాలన, ప్రజలతో డీలర్ల ప్రవర్తన ఇలా పలు రకాల సూచనలు చేసి పండుగలా ఆరంభించారు. దీంతో పాటు ఇంటి వద్ద రేషన్ అందుకొనే లబ్ధిదారుల వివరాలు డీలర్లకు అందజేసింది. తద్వారా ఇంటింటికీ పంపిణీ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని డీలర్లు వేడుకుంటున్నారు. ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయడం తమకు సమ్మతమే గాని, వయసుతో నిమిత్తం లేకుండా మంచానికే పరిమితమైన వద్దులు, వికలాంగులకు పంపిణీ చేస్తే, ఇటు తమకు, అటు ప్రభుత్వానికి ప్రయాణపు ఖర్చులు ఆదా అవుతుందన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో అటువంటి లబ్ధిదారులకు నామినీలను ఏర్పాటు చేసేవారని, వారు వచ్చి, రేషన్ సరుకులు తీసుకెళ్లే వారంటున్నారు. అటువంటి ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఇన్ని సంవత్సరాల అనంతరం తమ దుకాణాలు తిరిగి తమకు లభించడం సంతప్తికరంగా ఉందంటూనే, ఇళ్లకు వెళ్లి ఇస్తున్న తమకు ఇంకా దానికి సంబంధించిన ట్రావెలింగ్ అలవెన్స్‌లు, రాలేదని, ఇప్పించాలని కోరుకుంటున్నారు. కష్టానికి తగిన కమీషన్ తమకు దక్కడం లేదని, పైగా పలుమార్లు ప్యాకింగ్ పదార్థాలు చిరిగిపోయి, రేషన్ వృథా అవుతోందని, అది తమకు నష్టం చేకూరుస్తోందంటున్నారు. అదే ప్యాకెట్ పిన్ చేసి, లబ్ధిదారుకిస్తే అనుమానిస్తున్నారని, దీనికి తోడు చిల్లర సమస్య తో చిల్లర ఇవ్వలేకపోతే, అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు లబ్ధిదారులు భావిస్తున్నారంటున్నారు. ఏది ఏమైనా సమస్యను అధికారులకు చెప్పుకోలేక, ప్రభుత్వానికి విన్నవించలేక, అలవాటైన వత్తిని వదులుకోలేక రేషన్ డీలర్లు సతమతమవుతున్నట్లు తెలుస్తోంది.

అంగన్‌వాడీలో ఆట పాటలేవీ..

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అంగన్వాడీ కేంద్రాలలో తమ పిల్లలు ఆట, పాటలు నేర్చుకునేందుకు ఆధునిక ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని చిన్నారుల కోరుతున్నారు. తమ చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రంలో చేరిన తరువాత సెల్ ఫోన్‌లతో ఆడుకోవడం మానేశారని, వారి పనులు వారు చేసుకోవడం నేర్చుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని అంగన్వాడి కేంద్రాలలో చిన్నారుల ఆటపాటల కోసం ఇటీవలకలర్ టీవీ, ఉయ్యాలలు, జారుడు బల్ల, ఆర్ఓ వాటర్ ప్లాంట్ వంటి పలు హంగులు కల్పించారు. అయితే అవి సొంత భవనాలలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే పరిమితమయ్యిందని, అద్దె భవనాలలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఆ సౌకర్యాలు కల్పించకపోవడం ఏమిటని చిన్నారుల తల్లిదండ్రులు నిర్లిప్తత వ్యక్తం చేస్తున్నారు. అద్దె భవనం మార్చాల్సి వచ్చి, ఒకవేళ టీవీ, కేబుల్ కనెక్షన్ పదేపదే కనెక్షన్ ఇప్పించడం ఇబ్బంది అనుకుంటే కనీసం మిగిలిన ఆట వస్తువులైనా తమ పిల్లలు వెళుతున్న కేంద్రాలకు కేటాయించాలని కోరుతున్నారు. మండలంలో 62 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తుండగా, వాటిలో 30 కేంద్రాలు మాత్రమే సొంత భవనాలలో కొనసాగుతున్నాయి. మిగిలిన 32 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటికి కూడా సొంత భవనాలు నిర్మించి, వసతులు, హంగులు ఏర్పాటు చేస్తారా, లేదా అద్దె భవనాలలో నడిచే అంగన్వాడి కేంద్రాల పరిస్థితి అలాగే ఉంచుతారా అంటూ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాలలో గత ప్రభుత్వాల కాలంలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు నిర్మాణం ప్రారంభించి, మధ్యలో నిలిపివేశారని, కారణాలు తెలియ రాలేదని అంటున్నారు.



అంగన్‌వాడీ భవనంలో ఏర్పాటు చేసిన టీవీ, ఆట వస్తువులు

అరకొర సంక్షేమం..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ఆచరణలో తలకిందులవటంతో ఆశలపై నీళ్లు చల్లారనే అభిప్రాయం ప్రజలతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లోనూ వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఉచిత ఇసుక, మద్యం ధరల నియంత్రణపై బిన్నమైన పరిస్థితులు నెలకొన్న విషయం విధితమే. ఇప్పటికీ ఇసుక కొరత వేదిస్తోంది. మద్యం ధరలు తగ్గకపోవగా బెల్ట్ షాపులు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. ఎక్సైజ్ శాఖ కొరడా జులిపిస్తున్నా ఫలితం లేకపోయింది. గత నెలలో అమలు చేసిన తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవ వంటి పథకాలు సైతం అర్హులైన వారికి సైతం అందలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణానికి రంగం సిద్ధమవుతోంది. అయితే ఈ ప్రయణా లకు నిబంధనల చట్రాలు అడ్డుగోడలుగా మారనున్నాయి. మరోవైపు ఉన్నత విద్యనభ్య సించే విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా ఉచిత గ్యాస్ పథకం సైతం మేడిపండు చందంగా మారింది. ఉజ్వల్‌కు 3 సిలిండర్లు కోత విధించినట్లు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం చెప్పకనే చెప్పింది. కూటమి పాలకులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల కొరత

జిల్లాలోని రైతాంగాన్ని ఎరువుల కొరత వేధిస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగు తున్న నేపథ్యంలో ఎరువుల కొరత నెలకొంది. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువుల పంపిణీలో ఈ ఏడాది నుంచి కోత విధించిన విషయం విధితమే. ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై రైతులకు అరకొరగా అవగాహన కల్పించి అధికార యంత్రాంగం చేతులు దులుపు కుంది. సేంద్రియ విధానం దిగుబడులపై ప్రభావం చూపిస్తుందనే ఆందోళనతో రైతులు పాత పద్ధతులనే అనుసరిస్తున్నారు. ఈ నేపథ్యంలో యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల కొరత వెంటాడుతోంది. గత రబీ సాగులో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నగదు రైతులకు జమ చేయక పోవటం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు కౌలు రైతులకు వర్తించకపోవటంతో పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగిలింది. మరోవైపు ఎరువుల కొరత నేపథ్యంలో అప్పు దొరికే పరిస్థితి లేదు. దీంతో పరపతి ఉన్న పెద్ద రైతులకు మినహా, చిన్న మధ్య తరగతి రైతులకు ఈ ఏడాది సాగు ఆరంభంలోనే బాలారిష్టాలు ఎదురయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.5 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. అధికార యంత్రాం గం ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరంచి రైతులకు సేంద్రియ వ్యవసాయంపై పూర్తి అవగాహన కల్పించే వరకూ ఎరువులు యథాతథంగా సరఫరా చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

కూరగాయలు, నిత్యావసరాలు పైపైకి

ఓవైపు కూరగాయల ధరలు... మరో వైపు నిత్యావసర సరుకుల ధరలు కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నా యి. కిలో టమోటా రూ.50కి చేరిన విషయం విధితమే. ప్రభుత్వం ఏ రకం కూరగాయలు తీసుకున్నా రూ.50లు పై మాటే..శ్రావణ మాసం నేపథ్యంలో కూరగాయల వినియోగం ఒక్కసారిగా పెరిగింది. మరోవైపు డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేదు. దీంతో కొనుగోలు దారులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు. అల్లం కేజీ రూ.150కి చేరింది. మరోవైపు బియ్యం ధరలు ఇప్పటికే పెరిగి ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. బియ్యం ధరల పెంపునకు కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న జిఎస్‌టి కారణమని వ్యాపా రులు చెబుతున్నారు. ప్రజల ఆదాయాలకు పొంతన లేకుండా నిత్యావసర ఖర్చులు పెరగడం ఆందోళనకు గురి చేస్తోంది.

జ్వరం... కలవరం

జిల్లా ప్రజలను సీజనల్ జ్వరాలు చుట్టుముడుతున్నాయి. గడిచిన రెండు వారా లుగా వర్షాలు కురువటంతో పారిశుధ్య నిర్వ హణ అటకెక్కింది. గ్రామాల్లో పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో జ్వ ర పీడితుల సంఖ్య క్రమ క్రమంగా పెరగటం తో ప్రభుత్వ, ప్రైయివేట్ ఆస్పత్రులలో ఒపిల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు నేతి బీర చం దంగా మారాయి. బ్లడ్ టెస్ట్‌లు మొదలుకొని వివిధ రకాల పరీక్షలు, మందులు ప్రభుత్వ ఆస్పత్రులలో లభించడం లేదు. అత్యధిక మందిని జిల్లాలో ప్రధాన ఆస్పత్రులైన రాజమ హేంద్రవరం, కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు వెనకడుగు వేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితులలో తమ గ్రామాల్లోనే ఆర్‌ఎంపిలు, ఇతర ప్రైయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని కొత్త వజ్రకుటం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వెళు తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పామాయిల్ తోటలోకి దూసుకువెళ్లి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విజయవాడకు చెందిన డ్రైవర్ తుమ్మలగుంట శ్రీనివాసరావు (53) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ శివనాగబాబు తెలిపిన వివరాల ప్రకారం...గండేపల్లి గ్రామంలో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఆ శిబిరంపై దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద ఉన్న రూ.2,850 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్లు, కోడిపందాలు, బొమ్మ బొరుసు, గుండాటలు, ఎత్తులాట, కోతా బంతి లాంటి జూద క్రీడలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. జూదాలు జరుగుతున్నట్లు గ్రహిస్తే 100, 112, 9440796529, 94949 33233 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి-తాళ్లపూడి

పక్కిలంకలో పేకాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో రూ.13,590 నగుదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఇటీవల మండలంలోని చెందుర్తి జంక్షన్ వద్ద జరిగిన చోరీ కేసులో నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. శనివారం స్థానిక స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ జి.శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. గత నెల 28న రాజమహేంద్రవరంలోని భవాని సిల్వర్‌లో గుమస్తాగా పనిచేస్తున్న సమీర్ ప్రజాపత్ తన మోటార్ సైకిల్‌పై పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలులోని దుకాణాల నుంచి రాత్రి 8 గంటలకు బంగారం, వెండి, డబ్బులు తీసుకుని చెందుర్తి బయలుదేరాడు. మార్గం మధ్యలో నలుగురు వ్యక్తులు సమీర్ ప్రజాపత్‌ని బ్లేడ్‌తో బెదిరించి అతని వద్ద ఉన్న 51 గ్రాముల బంగారం, 12.5 కిలోల వెండి, రూ.60 వేలు నగదు దోచుకొనిపోయారు. దీంతో అతను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆ మేరకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో నిందుతులను అరెస్టు చేసేందుకు సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రైం టీముతో పాటు, ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సిసి ఫుటేజ్, సెల్ టవర్ సిగ్నల్స్ ద్వారా దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో కొనుగోన్న సెల్ నెంబర్ రాజమహేంద్రవరం భవాని సిల్వర్‌లో పనిచేసే వ్యక్తిదిగా గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి విచారించగా అతని ద్వారా అదే షాపులో పనిచేసే వేరొక అతను వారి స్నేహితుల ద్వారా ఈ చోరీ చేశారన్నారు. దొంగిలించిన బంగారం, వెండి, నగదును నిందితులు సామర్లకోట జల్లూరు మధ్యలో గ్రామ శివారిన ఒక పాడుబడ్డ పాకలో ఉంచి శనివారం వాటిని పంచుకొనుచుండగా నిందితులు రౌతు గోవిందు, గనిరెడ్డి సాయిప్రసాద్, కోన సాయిబాబు, బొమ్మను విజయ్‌ఆనంద్, కుక్కల శివమణికంఠలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18.50 లక్షల విలువ చేసే బంగారం, వెండి, నగదును, రెండు మోటార్ సైకిల్స్‌ను, ఐదు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో గొల్ల ప్రోలు, పిఠాపురం, యు.కొత్తపల్లి ఎస్ఐలు ఎన్.రామ కృష్ణ, మణికుమార్, జాన్‌బాషా వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు కూలీలను కబళించిన ప్రమాదం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని కానూరు అగ్రహారం గ్రామానికి చెందిన ఇద్దరు దినసరి కూలీలు కొవ్వూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో శనివారం మృతి చెందారు. గ్రామానికి చెందిన దవులూరి సుబ్రహ్మణ్యం (44), లంకే ప్రసాద్(26) శనివారం తెల్లవారుఝామున కడియపులంకలో పూల కుండీల లోడ్ పనికి బైకుపై వెళుతుండగా విజ్జేశ్వరం-సీతంపేట సమీపంలో రంగా విగ్రహం దగ్గర వెనక నుంచి లారీ బలంగా బైకును ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. దవులూరు సుబ్రహ్మణ్యం గల్ఫ్ దేశంలో 10 ఏళ్లు ఉండి తండ్రి మృతి చెందడంతో ఇటీవల స్వదేశానికి వచ్చి డైలీ కూలి పని నిమిత్తం కడియపులంకలోకి వెళ్తూ మృత్యువాత పడ్డాడు. ఆయనకు భార్య కుమారుడు ఉన్నారు. ప్రసాద్‌కు వివాహం కాలేదు. వీర మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలిసిన వెంటనే మంత్రి కందుల దుర్గేష్ హుటాహుటిన కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఘటనపై వివరాలు ఆరా తీశారు. తక్షణ సాయంగా బాధిత కుటుంబాలకు చెరో రూ.10,000 వ్యక్తిగత ఆర్థిక సాయం అందించారు.

వృద్ధురాలి చెవి దుద్దుల అపహరణ

ప్రజాశక్తి- కొవ్వూరు

గోపాలపురం మండలం చిట్యాలకు చెందిన వృద్ధురాలు ఊనగట్ల పుటాలమ్మ వాడపల్లిలో బంధువుల ఇంటికి వచ్చింది. తిరిగి చిట్యాల వెళుతుండగా ఒక కేటుగాడు ఆమెను బైకుపై దింపుతానని ఎక్కించుకున్నాడు. కొవ్వూరమ్మ తల్లి గుడి వద్దకు తీసుకుని వచ్చి ఆమెను దింపాడు. తాను బంగారం షాపునకు వెళ్లి అతడి తలికి బంగారు చెవి దిద్దులు కొనుక్కుని వస్తానని చెప్పి నమ్మించాడు. మళ్లీ వచ్చి మీ ఊరు తీసుకువెళ్తానని నమ్మబలికాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చి మా అమ్మకు చెవి దిద్దులు కొనాలి, నీ చెవి దిద్దులు సైజు తీసుకువెళ్లాలని, ఒకసారి దిద్దులు ఇవ్వమని చెప్పి అడిగాడు. ఆ మాయగాడి మాటలు నమ్మి ఆమె చెవిదిద్దులు ఇచ్చింది. నువ్వు ఇక్కడే ఉండమ్మా నేను మళ్లీ వస్తానని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమెను గమనించిన స్థానికులు విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో టౌన్ పోలీసులు ఆమె వద్దకు వెళ్లి కేసు విచారణ చేపట్టారు.

గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - కరప

స్థానిక పిహెచ్‌సిలో శనివారం గర్భిణులకు కాకినాడ మౌర్య హాస్పిటల్ అధినేత డాక్టర్ పుల్ల ప్రసాద్ సహకారంతో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు మాట్లాడుతూ ప్రతినెల 9వ తేదీన పిఎం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం చేపడుతన్నామని అన్నారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలని కోరిన వెంటనే స్పందించిన మౌర్య హాస్పిటల్ యాజమాన్యంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ ఎన్.ఉజ్వల, పిహెచ్‌సి మెడికల్ అధికారి డాక్టర్ ఆఫ్రోజ్, నాయకులు నక్క వీరభద్రరావు, మంగ పరమేష్, పేపకాయల తణుకులరాజు పాల్గొన్నారు.

వల్లభునికి రూ.3.1 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.3,10,502 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,79,360, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,02,032, కేశఖండన ద్వారా రూ.5,560, తులాభారం ద్వారా రూ.450, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.23,100 వచ్చినట్లు తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

వల్లభస్వామిని దర్శించుకున్న సిఆర్‌డిఎ కమిషనర్

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామిని శనివారం సిఆర్‌డిఎ కమిషనర్ కె.కన్నబాబు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, శశికుమార్, రాగాల ఉమామహేశ్వరరావు, నల్ల బాబు పాల్గొన్నారు.

రామచంద్రరావు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వడ్లమూరు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు, పెద్దాపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలి రామచంద్రరావు కుటుంబ సభ్యులకు జనసేన జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు శనివారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. రామచంద్రరావు ఇటీవల కాలంలో మృతి చెందారు. తొలుత రామచంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రరావు కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తమనార లక్ష్మణ్‌దివాకర్, గొల్లపల్లి భద్ర, గుమ్మల్ల వెంకటేష్, ఎర్రవరపు రాజు, పాలిసెట్టి రాజు, చెన్నం వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు సర్పంచ్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి - కోటనందూరు

కోటనందూరు సర్పంచ్ గరిసింగు దొరబాబు మాతృమూర్తి గరిసింగు మరిడమ్మ(75) శనివారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె మృతికి ఎంపిపి లగుడు శ్రీనివాస్, వైసిపి నాయకులు కురందాసు రాము, చింతకాయల చిన్నబాబు, గొర్ల రామచంద్రరావు, జగటాల వీరబాబు, జగటాల కోట సత్తిబాబు, కొత్తపల్లి మాణిక్యాలరావు, బండి నానిబాబు, కృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

ప్రజాశక్తి - జగ్గంపేట

రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఎడి జి.శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం మండలంలోని వ్యవసాయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎరువులు, విత్తనాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 9,300 కాగా, ఈ ఏడాది సుమారు 2500 ఎకరాలు మాత్రమే సాగు అయిందన్నారు. ఆగస్టు నెలలో 10 రోజులు గడిచిపోతుందన్నారు. మరో వారం రోజుల్లో వర్షాలు పడితే వరి పంటను ఎదజల్లే విధానంలో చేసేలా రైతులను సన్నద్ధం చేయాలన్నారు. వర్షాలు కురవకపోతే ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలని, రాయితీపై ప్రభుత్వం అందించే విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఖరీఫ్ సాగు రైతులకు ఈ క్రాఫ్ నమోదు చేయాలన్నారు. ఈ సమీక్షలో మండల వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం, మండలంలోని వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మద్యాంధ్రాప్రదేశ్‌గా మారుస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా సిఎం చంద్రబాబు మారుస్తున్నారని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతుందని అన్నారు. ఈ మద్యం వల్ల అనేక కుటుంబాలు నాశనం అవుతున్నాయని అన్నారు. విచ్చలవిడిగా మద్యం షాపులకు, బెల్టు షాపులకు అనుమతులు ఇవ్వడం వల్లే ఈ పరిస్థితికి కారణమన్నారు. స్వర్ణాంధ్ర సారథిగా చెప్పుకుంటున్న చంద్రబాబు రాష్ట్రాన్ని లిక్కర్ ఆంధ్రగా మార్చేసి ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటమాడుతున్నారని అన్నారు. మద్యం షాపుల్లో అర్ధరాత్రి దాటిన అమ్మకాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఆదాయం కోసం మద్యం అమ్మకాలపై టార్గెట్లు పెట్టడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

పట్టపగలే వీధిలైట్ల వెలుగులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-సామర్లకోట రహదారిలో ఏలేరు ఇరిగేషన్ ప్రాజెక్టు పరిసరాలలో శనివారం పట్టపగలే వీధి లైట్లు వెలుగుతున్నాయి. కొన్ని ప్రాంతా లలో రాత్రి సమయంలో వీధిలైట్లు వెలగడం లేదు. ఈ వీధిలైట్ల నిర్వహణలో లోపాల కారణంగానే ఇలా జరుగుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణ పరిధిలో వీధిలైట్ల నిర్వ హణను పరిశీలించి లోపాలు గుర్తించి సరి చేయించాలని, వెలగని వీధిలైట్లు స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



వెలుగుతున్న వీధిలైట్లు

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని నియోజకవర్గ మైనార్టీ బిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు సిఎంచంద్రబాబుకు లేఖ రాసారు. నాగేశ్వరరావు విలేకరులతో శనివారం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒక్కటైన రామచంద్రపురం నియోజకవర్గంలో రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలు ఉన్నాయని అన్నారు. కేవలం కాజులూరు మండలం మాత్రమే కలిపి మిగిలిన రెండు మండలాలు అనగా రామచంద్రపురం, కె.గంగవరం మండలాలను కలపకుండా గత ప్రభుత్వంలో జిల్లాలు విభజన భాగంలో. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే, కనీస మౌలికా సదుపాయాలు కల్పించకుండానే రామచంద్రపురం నియోజకవర్గాన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కలిపారన్నారు. నియోజకవర్గం ప్రజలు జిల్లా కేంద్రం అయిన అమలాపురం వెళ్లాలంటే కోటిపల్లి రేవు నుంచి ముక్తేశ్వరం రేవు వరకు పంటి దాటి వెళ్ళవలసిన ప్రమాదకర పరిస్థితి నెలకొందన్నారు. తిరిగి ప్రయాణంలో సాయంత్రం ఆరు గంటల దాటితే పంటు తిరగదన్నారు. దీని వలన జిల్లా కేంద్రం అమలాపురం వెళ్లాలంటే కనీసం రెండు గంటలు నుండి మూడు గంటలు వరకు సమయం పడుతుందని తెలిపారు. ఈ కారణంగా నియోజకవర్గం ప్రజలు విన్నపాన్ని స్వీకరించి మా నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని ప్రజలు తరుపున కోరుచూ లేఖ రాసినట్లు విలేకరులకు తెలిపారు.

బాలబాలాజీ స్వామికి వెండి వస్తువుల బహూకరణ

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి నిత్య కైంకర్యాల నిమిత్తమై లక్కవరం వాసులు ముదునూరి పాండురంగరాజు రాణి దంపతులు వారి కుటుంబ సభ్యులు శనివారం రూ.3.45 లక్షలు విలువైన మూడు కేజీలు వెండి బిందె, రెండు వెండి దీపం కుందెలు, వెండి పళ్ళెం సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్య నారాయణ రాజు తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు. బాల బాలాజీ ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.3,53,720లు ఆదాయం సమకూరిందన్నారు ఇందులో నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1,01,912లు ఆదాయం వచ్చిం దన్నారు ఐదువేల మంది యాత్రికులు స్వామివారిని దర్శనం చేసుకోగా 3వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు అన్నారు.

ట్రస్ట్ బోర్డ్ నియామకానికి ఉత్తర్వుల జారీ

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయ శాఖ కమిషనర్ (విజయవాడ) నోటిఫికేషన్ జారీ చేశారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ విడుదల నుంచి 20 రోజులలోపు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాల కోసం కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలన్నారు

ఘనంగా మహేష్‌బాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

హీరో మహేష్ బాబు 50వ పుట్టినరోజు వేడుకలను ద్రాక్షారామంలో శనివారం ఘనంగా నిర్వహిం చారు. ద్రాక్షారామంలో రోటరీక్లబ్ కాకినాడ, మహేష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, స్కూల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి, క్రికెట్ కిట్లు, వీధి వ్యాపారులకు గొడుగులు, మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు వంటి కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. వ్యాక్సిన్లను మంత్రి సుభాష్, డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ సురభి శారద, రోటరీ క్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ తడాల బుజ్జి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రికీ హాస్పిటల్, రికీ ట్రినిటీ, ద్రాక్షారామం సొసైటీ అధ్యక్షులు ముప్పనపల్లి గణేష్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, తడాల వరప్రసాద్, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** స్థానిక అంబేద్కర్ కన్వెన్షన్ హాలునందు శనివారం హీరో మహేష్ బాబు 50వ పుట్టినరోజు వేడుకలు ప్రిన్స్ మహేష్ బాబు అభిమాన సంఘం అధ్యక్షుడు పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బుద్ధాల బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో మహేష్ బాబు అభిమానులు రక్తదానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, వృద్ధులకు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమాన సంఘం వైస్ ప్రెసిడెంట్ జంగా కొండ, యల్లమిల్లి చంటి, కాశి లాజర్ మట్టపర్తి రమణ, రెడ్డి స్వామి, జనిపల్లి అశోక్ పాల్గొన్నారు.

అంగరలో చిన్నారులకు తులాభారం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం చిన్నారులకు తులాభారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల మొక్కు తీర్చుకునేందుకు ఆలయానికి వచ్చిన యాత్రికులకు ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చిన్నారుల తల్లిదండ్రులు పటిక బెల్లంతో తులాభారం నిర్వహించగా ఆలయ అర్చకులు కె.బాల బాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో పలువురు పండితులు చిన్నారులకు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు.



ప్లీడర్ల వీధిలో కురుస్తున్న వర్షం

పెద్దాపురంలో భారీ వర్షం

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలో శనివారం కురిసిన వర్షంతో రహదారులన్నీ జలమయంగా మారిపోయాయి. డ్రైయిన్‌లో పూడికల వల్ల ప్రవహించక ఆగిపోయిన మురుగునీరు వర్షం నీటిలో కలిసి ప్రవహించటంతో కొన్ని వీధులలో మురుగునీరు, వర్షం నీరు కలిసి ప్రవహించింది. దీనివల్ల ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్ నుంచి దర్గా సెంటర్ వరకు ప్లీడర్ల వీధిలో మురుగునీరు, వర్షపు నీరు కలిసి ప్రవహించింది.

సార్వత్రిక విద్యాపీఠం పర్యవేక్షణలో ఓపెన్ ఇంటర్ కోర్సులు

ప్రజాశక్తి - రాజోలు

చదువు మధ్యలో నిలిపేసిన వారు తిరిగి కొనసాగించే వీలుగా.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో సార్వత్రిక విద్యాపీఠం పర్యవేక్షణలో ఇంటర్మీడియట్ కోర్సులు అభ్యసించడానికి అవకాశం కల్పిస్తోందని మలికిపురం కోఆర్డినేటర్ పిడికె.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విశ్వ విద్యాలయాలు, ప్రయివేటు సంస్థల్లో దూర విద్యావిధానంలో చదువుకోవడానికి వీలుందన్నారు. గతం నుంచి ఈ విధానం నడుస్తున్నప్పటికీ తాజాగా మళ్ళీ ఈ ప్రభుత్వం విద్యా వికాసం సాధికారిత పెంచాలనే ఉద్దేశంతో పది, ఇంటర్ చదవడానికి అవకాశం కల్పిస్తోందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు మలికిపురం ఎంవిఎన్, జెఎస్, ఆర్‌విఆర్, డిగ్రీ కళాశాల ద్వారా ప్రవేశం పొందొచ్చునని వివరించారు. మహిళలు, వృత్తి, వ్యాపార రంగాలపై ఆధారపడిన వారు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సంఘ సభ్యులు, సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాలు చదువుకోవడానికి వెసులుబాటు ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 15 సంవత్సరాలు నిండిన వారందరూ ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరడానికి అవకాశం ఉందని చెప్పారు. అలాగే గతంలో ఇంటర్ పరీక్షలు తప్పిన వారు, సగంలో మానేసిన వారు కూడా చేరొచ్చునని వివరించారు. పాఠశాలలో పదో తరగతి, కళాశాలలో ఇంటర్మీడియట్ అనుత్తీర్ణులైనప్పటికీ వారు పాసైన రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకునే అవకాశం కల్పిస్తారన్నారు. వికలాంగులు, ట్రాన్స్ జెండర్లు, మాజీ సైనిక ఉద్యోగులకు అడ్మిషన్ ఫీజులో రాయితీ ఇస్తారని పేర్కొన్నారు. అభ్యాసకులు ప్రవేశం పొందే నాటి నుంచి ఐదేళ్ల వరకు 9 పర్యాయాలు పబ్లిక్ పరీక్షలకు హాజరు కావొచ్చునని చెప్పారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైతే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ధృవపత్రాలను డిజి లాకర్లో భద్రపరచడానికి కూడా అవకాశం కల్పిస్తారని వివరించారు. వివరాలకు 96186 47987 ఫోన్‌లో సంప్రదించవచ్చున్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - నల్లజర్ల

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్‌ఎ వెంకటరాజు అన్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సూపర్ సిక్స్ పథకాల ద్వారా 150000 మంది లబ్ధి పొందుతున్నారు అన్నారు .పల్లె పండుగ ద్వారా రూ.70 కోట్ల పనులు నిర్మాణం చేపట్టామన్నారు అంతేకాకుండా మరో 100 కోట్లకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. మార్కెట్ యార్డ్ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మ రాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో గత నాలుగు సంవత్సరాలలో జరగని అభివద్ధి తమ ప్రభుత్వం ఏడాదిలో పూర్తి చేసిందని అన్నారు ముందుగా నల్లజర్ల శివారులో ఉన్న అక్షయ పాత్ర హోటల్ దగ్గర నుంచి చెక్ పోస్ట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పి మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపరాజు తదితరులు పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు గ్రామ శివారులో సారా బట్టీపై ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. ఈ దాడిలో 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ దుర్గార్జునరావు తెలిపారు. పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగే అనుమానిత ప్రాంతాల్లో నిఘాను పెంచినట్లు ఆయన తెలిపారు. ఈ దాడిలో సిఐ విజయశంకర్, ఎస్ఐ వి.మౌనిక, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-గోకవరం

తిరుమలయపాలెం గ్రామ శివారు జిడిమామిడి తోటలో సారా బట్టీలపై పోలీసులు దాడి చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న గండిబోయిన వీర మహేంద్రను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.